క్లుప్తంగా

విద్యుత్ ఏఈగా బాధ్యతలు



పుల్లయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ సిబ్బంది

బేతంచెర్ల: స్థానిక విద్యుత్ ఏఈగా పుల్లయ్య శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో బేతంచెర్ల ఏఈగా ఉన్న మహబూబ్‌వలీ కర్నూలు సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పాణ్యంలో పనిచేస్తున్న పుల్లయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు లైన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌బాబు, లైన్‌మన్లు మస్తాన్, శ్రీనివాసులు, గౌడ్, శేఖర్, సుబ్బయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



నరేంద్ర

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సి.నరేంద్ర రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బయ్యన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నంద్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటినట్లు చెప్పారు. ఇతను ఈ నెల 7వ తేదీ నుంచి రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

భోజన కార్మికుల తొలగింపు అన్యాయం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

బేతంచెర్ల: ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ఉన్న ఫలంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులిమి కార్మికులు, స్కావెంజర్స్‌ను అక్రమంగా తొలగిస్తోందని.. ఇది మంచి పద్ధతి కాదని.. తీరు మార్చుకోకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అవుకు: మండల కేంద్రం అవుకు సమీపంలోని చిన్న చెరువులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. అవుకు–మెట్టుపల్లె రహదారిలోని చిన్న చెరువులో కట్టకు మొదట్లోనే కంపచెట్ల కింద కుళ్లిపోయిన ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తీసేందుకు వీలుకాని విధంగా మృతదేహం కుళ్లిపోయింది. దీంతో ఆదివారం బయటకు తీసేందుకు నిర్ణయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణానికి చెందిన 150 మంది అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ. 100 చొప్పున పింఛన్లు పంపిణీ చేశారు.

యువకుడి ఆత్మహత్య



పిల్లి సుబ్బరాయుడు

సంజామల: అనారోగ్య సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రామక్రిష్టారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పిల్లి సుబ్బరాయుడు(35) అనారోగ్య సమస్యలతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుబ్బలక్ష్మమ్మ కూరగాయల వ్యాపారం ముగించుకుని ఇంటికి వచ్చే సరికి ఉరివేసుకుని కనిపించాడు. మృతునికి భార్య సుబ్బలక్ష్మమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

డోన్: పట్టణంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లలో అపరిశుభ్రత వాతావరణం ఉంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం స్థానిక అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసి భోజన నాణ్యత గురించి ఆరా తీశారు. ఆయన వెంట డీఈ రఘు, ఏఈ సురేష్ తదితరులు ఉన్నారు.

తూకమేస్తున్నారు..!

- రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి అడ్డాగా డోన్
- తూకంలో దోపిడీకి గురవుతున్న కార్డుదారులు
- అక్రమార్జనకు తెరలేపిన టీడీపీ నాయకులు
- మామూళ్ల మత్తులో మౌనం వహిస్తున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు





రేషన్ బియ్యాన్ని గోడౌన్‌కు చేరుస్తున్న ఆటో



తూకంలో 4 కేజీలు తేడా చూపుతున్న దృశ్యం

డోన్: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నాయకులు రేషన్ షాప్ డీలర్ల అవతారమెత్తారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయకుండా తూకాల్లో మోసం చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటా ద్వారా రేషన్ బియ్యాన్ని తూకం వేయాల్సి ఉండగా, పాత పద్ధతిలోనే రాళ్లు పెట్టి తూకం వేస్తూ కార్డుదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. డీలర్ల ముసుగులో పచ్చ నాయకులు ప్రజాపంపిణీ వ్యవస్థను ఎప్పటిలాగానే భ్రష్టు పట్టించారు. అధికార యంత్రాంగం అండతో ఈ దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.

ఇంటింటికి రేషన్ బియ్యం ఎక్కడ..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి రేషన్ సరఫరా చేసింది. అయితే ఇంటింటికి రేషన్ బియ్యం పథకాన్ని త్వరలోనే తొలగిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేయడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ పంపిణీ చేసే వ్యాన్లను తొలగించి రేషన్ షాపుల విధానాన్ని తిరిగి కొనసాగిస్తామని ఆయన ప్రకటించడంతో టీడీపీ నాయకుల నిలువు దోపిడీకి పచ్చ జెండా ఊపినట్లయింది.

విజిలెన్స్.. సైలెన్స్

పౌరసరఫరా పంపిణీ విధానంలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాల్సిన విజిలెన్స్ అధికారులు టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నోరుమెదిపేందుకు కూడా సాహసించడం లేదు. రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా యథేచ్ఛగా జరుగుతున్నా డోన్ వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

టీడీపీ నాయకుల దందా

అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని రైస్‌మిల్లులు, మద్యం తయారీ ఫ్యాక్టరీలకు సరఫరా చేసే వారందరూ టీడీపీ నాయకులే కావడం గమనార్హం. డోన్ పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న వేర్ హౌసింగ్ ఎదురుగా టైర్లషాప్ సమీపంలో టీడీపీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి అక్రమ రేషన్ బియ్యం కోసం గోడౌన్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని యూ.కొత్తపల్లె గ్రామ పారిశ్రామిక వాడలో క్రిష్ణగిరి మండలానికి చెందిన ఆ పార్టీ నేత ఒకరు బహిరంగంగా రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక కొత్తబస్టాండ్ ఎదురుగా పాత రైస్‌మిల్లులో డోన్ మండలం జలదుర్గం గ్రామానికి చెందిన వ్యక్తి, ప్రభుత్వ ఐటీఐ వద్ద జగదుర్తి గ్రామానికి చెందిన మరో టీడీపీ నాయకుడు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. వీరందరిపై గతంలో అనేక కేసులు ఉన్నా విజిలెన్స్ అధికారులు మాత్రం ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడడం లేదు.

డోన్.. అక్రమ వ్యాపారానికి అడ్డా

డోన్ నుంచి ప్రతి నెలా 50 లారీల వరకు రేషన్ బియ్యం అక్రమంగా ఇతర ప్రాంతాలకు రవాణా అవుతుంటుంది. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ దందా మరింత ఎక్కువైంది. అధికార పార్టీ నాయకులంతా రేషన్ వ్యాపారుల అవతారమెత్తడం వల్ల రెవెన్యూ, పోలీసు, విజిలెన్స్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డోన్ నియోజకవర్గంలో రేషన్ దుకాణాల వివరాలు

మండలం	దుకాణాలు	కార్డుదారులు
డోన్	72	35,189
బేతంచెర్ల	48	27,030
ప్యాపిలి	54	22,936
అంత్యోదయ కార్డులు	--	1,500

డోన్ ఆర్‌ఐగా మస్తాన్

డోన్ టౌన్: డోన్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా మస్తాన్ శనివారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన డోన్‌కు బదిలీపై వచ్చారు.

శనగ విత్తనాల పంపిణీకి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభించినట్లు వ్యవసాయాధికారిణి జ్యోతి తెలిపారు. కొలిమిగుండ్ల మండలానికి 2,480 క్వింటాళ్ల శనగలు మంజూరైనట్లు చెప్పారు. రైతులు క్వింటాకు రూ.7050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రైతుకు ఎకరాకు 40 కేజీల చొప్పున అందిస్తామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లోనే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

25శాతం రాయితీతో శనగ విత్తనాలు

బేతంచెర్ల: రబీలో సాగు చేసేందుకు 25 శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టేషన్లు చేసుకోవాలని సూచించారు. అలాగే విత్తనశుద్ధి కోసం ట్రైకోడెర్మావిరిడి మందు 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

ఈ–పంట నమోదును పూర్తి చేయాలి

ప్యాపిలి: మండలంలో నిర్వహిస్తున్న ఈ–పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం చంద్రపల్లె, కలచట్ల గ్రామాల్లో జరుగుతున్న 2024 ఖరీఫ్ ఈ–పంట నమోదు ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ప్యాపిలి మండలంలో పెండింగ్‌లో ఉన్న 5 శాతం నమోదును వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈయన వెంట మండల వ్యవసాయ అధికారి రాజేష్, విస్తరణాధికారి పద్మప్రియ ఉన్నారు.

9వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తాకీబాషా

కోవెలకుంట్ల: నూతన మద్యం పాలసీ ప్రకారం కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రైవేట్ మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉన్నట్లు ఆ శాఖ సీఐ తాకీబాషా తెలిపారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కోవెలకుంట్ల మండలంలో ఐదు, సంజామల మండలంలో నాలుగు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లో ఒక్కో మద్యం దుకాణం ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఒక్కో షాపునకు రూ. 2 లక్షల చొప్పున ఒక్కో వ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటి వరకు రెండు దరఖాస్తులు మాత్రమే అందాయని వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా షాపులు కేటాయిస్తామని వెల్లడించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక్కో షాపునకు రూ. 55 లక్షల లైసెన్స్ ఫీజు నిర్దేశించామని చెప్పారు. లాటరీలో మద్యం షాపు పొందిన వ్యక్తి ఏడాదికి నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉందన్నారు. మొదటి విడతలో రూ. 13.75 లక్షలు చెల్లించి లైసెన్స్ పొందాలని సూచించారు. ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్‌నాయక్, సందీప్‌యాదవ్ ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ శాఖ డీఈఈ కృష్ణారెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్‌శాఖ డీఈఈ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బీవీ రమణతో కలిసి హౌసింగ్, ఎన్‌ఆర్‌జీఎస్ పనులపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ హౌసింగ్ లబ్ధిదారుల వద్దకు వెళ్లి గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిల్లుల మంజూరులో నిధుల సమస్యలేదని.. వెంటనే బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, ఏపీఓ హరికృష్ణ, ఈసీ మక్బుల్, టీఏలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ టౌన్: రోడ్డు భద్రతా నియమాలను అందరూ తప్పనిసరిగా పాటించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో క్యాబ్, ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎన్నో కుటుంబాలు దుర్భర జీవితం గడుపుతున్నాయని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంతో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదం అన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారి వీడియోలు చూపించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా స్కూల్ బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: గత మున్సిపల్ సర్వసభ్య సమావేశాల్లో ఆమోదించిన తీర్మానాలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, డీఈ రఘు, ఏఈ సురేష్‌తో కలిసి అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. డ్రైనేజీ, మంచినీరు, వీధి దీపాల సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు.

అన్నపూర్ణదేవిగా అభయం



కొలిమిగుండ్ల: రాజరాజేశ్వరిదేవి




ప్యాపిలి: అన్నపూర్ణదేవిగా వాసవీమాత



కోవెలకుంట్ల: గజలక్ష్మి దేవిగా వాసవీమాత



కోవెలకుంట్ల: అన్నపూర్ణా దేవిగా మారెమ్మ



డోన్: అన్నపూర్ణదేవిగా గాయత్రీదేవి



సంజామల: అన్నపూర్ణేశ్వరిదేవిగా..



డోన్: అన్నపూర్ణదేవిగా దుర్గాదేవి



అవుకు: అమ్మవారిశాలలో..



గాయత్రీదేవిగా మహాలక్ష్మి

డోన్ టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం డోన్ పాత బస్టాండ్‌లో వెలసిన కనకదుర్గాదేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు ఆలయం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వరాలివ్వు.. వాసవీమాతా

కోవెలకుంట్ల: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని కోవెలకుంట్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంకాలమ్మ, సరస్వతీ నగర్‌లో వెలసిన ఆలయాల్లో మారెమ్మ, ప్రసన్నభారతీమాత అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు.

ప్యాపిలి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం వాసవీమాత అన్నపూర్ణదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు.

కొలిమిగుండ్ల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని రాజరాజేశ్వరిదేవి అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

డోన్ టౌన్: పట్టణం సమీపంలోని గాయత్రీ పీఠంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గాయత్రీదేవి అన్నపూర్ణదేవిగా భక్తులను అనుగ్రహించారు.

అవుకు: స్థానిక అమ్మవారిశాలలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని శనివారం బాలాత్రిపురసుందరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

చంద్రఘంట అలంకారంలో చౌడేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారు శనివారం చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపారాయణం, చండీపారాయణం తదితర పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కొండపేటలోని వాసవీమాత గాయత్రీదేవిగా,అయ్యప్పస్వామి ఆలయంలోని గాయత్రీదేవి అన్నపూర్ణ దేవిగా కనిపించారు.

జగన్మాతా.. నమోనమామి



బేతంచెర్ల: అన్నపూర్ణాదేవిని దర్శించుకుంటున్న భక్తులు



బేతంచెర్లలో హనుమంత వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి



కోలాటం ఆడుతున్న మహిళలు

బేతంచెర్ల: అశ్వయుజ శుద్ధ తదియను పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో వెలసిన వాసవిమాత అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్టపెద్దమ్మ, దుర్గాపేటలోని మహిషాసురమర్దిని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గౌరిపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు శనివారం హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. డోలువాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు కనులపండువగా సాగింది.



నందవరంలో చంద్రఘంట అలకారంలో చౌడేశ్వరిదేవి



బనగానపల్లె: గాయత్రి దేవిగా వాసవీమాత



బేతంచెర్ల: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



కోవెలకుంట్లలో కంది పంటలో చేరిన వర్షపునీరు



అమడాలలో తడిచిన మొక్కజొన్నను రోడ్డుపై ఆరబోసిన దృశ్యం

భారీ వర్షం..పంట నష్టం

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 43.2మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 7 మి.మీ, అవుకు మండలంలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షంతో కోవెలకుంట్ల మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప, పొగాకు, జొన్న, తదితర పంటలు నీట మునిగి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పైరు కోత, నూర్పిడి దశలో ఉండగా భారీ వర్షం కురవడంతో తడిచిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.